# కావాలీ....... వొద్దా

★

తురగా సుందరం

అ

నరసాపురం
ది 12-4-47

ప్రియమైన వెంకట్రావుకి,

నీకు పైగ్రేడులోకి ప్రమోషను అయినందుకు సంతోషంగా ఉంది. నేనేదో మెల్లిగా ఉద్యోగం యీడుస్తున్నా. కాని యీమధ్య మాకొక గొప్పసమస్య వచ్చిపడింది. అది తీర్చే బాధ్యత నీమీద ఉంది. నువ్వూ, నేనూ చిన్నప్పట్నుంచీ చదువుకున్నందుకు ఆమాత్రం సహాయంచెయ్యాలి. మా పెద్దవాడు జనార్దనం స్కూలుఫైనలుపరీక్షకి వెళ్లేడు. బాగా రాసేడుట. తప్పకుండా పాసవుతానన్నాడు. వాడి విషయంలో నాకేమీ సందేహం లేదులే. వాళ్ల మేష్టరుకూడా అలాగే చెప్పేడు. వాడిని వచ్చే యేడాది రాజమండ్రీలో ఇంటరుమీడియటులో చేర్పించాలని ఉంది.

ప్రస్తుతం వచ్చిన చిక్కేమిటంటే వాణ్ణి వేరే చదువుకోసం రాజమండ్రీలో ఉంచితే డబ్బుఖర్చు చాలా అవుతుంది, అంత నేను ఆదుకోలేనేమో అని భయంగా ఉంది. నాకు కనుక రాజమండ్రీ బదిలీ అయితే అన్నీ కలిసివస్తాయి. కాబట్టి నువ్వు మా డైరక్టరుని కలుసుకుని ఎలాగో నచ్చచెప్పి నాకు ట్రాన్సుఫరు చేయిస్తే నీ మేలు ఎప్పటికి మర్చిపోను. నువ్వు సరిగ్గా తలుచుకుంటే ఇది చాలా సులభమైన పని.

అందర్నీ అడిగేనని చెప్పవలిసింది.

ఇట్లు
భరద్వాజం

ఆ

మద్రాసు
ది 12-5-47

ప్రియమైన భరద్వాజానికి.

నీ ఉత్తరం అందింది, నాకు ప్రమోషను దొరకడంవల్ల నాకు యిక్కడ బాగానే ఉంటోంది. జనార్దనం అప్పుడే ఇంటరులోకి రాబోతోన్నందుకు సంతోషంగా ఉంది. మా డైరక్టరుతో మాట్లాడేను. ఇదివరకే కొన్ని సందర్భాలలో పరిచయం అవడంవల్ల నీ బదిలీ విషయానికి అప్పుడే ఒప్పుకున్నాడు. వచ్చే జూను నెల మొదటి వారానికి ఆర్డర్లు వస్తాయి.

పిల్లలకి నా ముద్దులు.

ఇట్లు
వెంకట్రావు

ఇ

నరసాపురం
ది 15-5-47

ప్రియమైన వెంకట్రావుకి,

నువ్వు రాసిన ఉత్తరం అందినది. చాలా సంతోషమైంది. నువ్వుచేసిన ఉపకారానికి చాలా కృతజ్ఞుడను.

ఇట్లు
భరద్వాజం

ఈ

నరసాపురం
ది 6-6-47

ప్రియమైన వెంకట్రావుకి,

అక్కడ అంతా క్షేమంగా ఉన్నారని తలుస్తాను. మనం యింతవరకు చేసిన ప్రయత్నం వృధాఅయినందుకు చాలా విచారంగా ఉంది. ఇవాళే పరీక్షాఫలితాలు వచ్చేయి. దాంట్లో మా వాడి నంబరు లేదు. చివరరోజుల్లో నేనెంత చెప్పినా వాడు సరిగ్గా చదవలేదు. వాళ్ల మేష్టరు కూడా అలాగే అన్నాడు. తెలివితేటలుంటే మటుకు లాభం ఏవిటి, సరియైన కృషి లేకపోయిన తర్వాత ?

వాడి పరీక్ష పోయినందువల్ల నాకు రాజమండ్రీ వెళ్ళి ఏమీ ప్రయోజనంలేదు. పైగా యిక్కడ స్వంతయింట్లో ఉండడంవల్ల అద్దె కలిసివస్తోంది.

ఇంతమట్టుకు బదిలీ ఆర్డరు రాలేదు కాబట్టి నువ్వు మళ్లీ వెళ్లి యిదివరకువి ఆర్డరు కేన్సిలు చేయిస్తే నేను చాలా కృతజ్ఞుడనై వుండగలను.

శ్రమ యిచ్చినందుకు క్షమించవలసింది.

ఇట్లు
భరద్వాజం

ఉ

మద్రాసు,
ది 15- --47

ప్రియమైన భరద్వాజానికి,

నీ ఉత్తరం అందినది. జనార్దనం పరీక్ష పోయినందుకు విచారంగా ఉంది. మళ్లీ డైరక్టరు దగ్గరకు వెళ్ళి నీ విషయం చెప్పితే కొంచెం విసుక్కున్నాడు కాని, ఆర్డరు తీసివేయించేడు. ఇంకేమీ ఫరవాలేదు.

నీ క్షేమసంగతి తరుచు రాస్తోండవలిసింది.

ఇట్లు
వెంకట్రావు

ఊ

నరసాపురం
ది 30-6- 7

ప్రియమైన వెంకట్రావుకి,

నీ ఉత్తరం అందింది. కాని యివాళే సప్లిమెంటరీ లిస్టులో జనార్దనం నంబరు వచ్చింది. అసలు వాడు మొదటి లిస్టులో నంబరు లేకపోయినా రెండో లిస్టులో అన్నా తప్పకుండా వస్తుందని అంటూనే ఉన్నాడు. నేను కూడా చాలామట్టుకు అలాగే అనుకున్నాను. వాళ్ళ మేష్టరు కూడా అలాగే అన్నాడు. ఏదో ఒక గండం గడిచింది.

నీకు యింతమట్టుకు శ్రమ యిచ్చేను కాని, యిప్పుడు యింకో విధంగా అనుకోకుండా ఆఖరు సారి దయయుంచి, డైరక్టరుకు నచ్చచెప్పి మళ్లీ రాజమండ్రీకి బదిలీ చేయిస్తే ఎప్పటికీ నిన్ను తలుచుకుంటూ ఉంటాను.

ఇట్లు
భరద్వాజం

ఋ

మద్రాసు
ది 10-7-47

ప్రియమైన భరద్వాజానికి,

నీ ఉత్తరం అందినది. జనార్దనం పేసయినందుకు సంతోషంగా ఉంది. కాని నాకు నువ్వు గొప్ప చిక్కు తెచ్చిపెట్టేవు. క్రిందటిసారే డైరక్టరు విసుక్కున్నాడు. సరే నువ్వు ఆఖరు సారని రాసేవు కనుక ఎలాగో బతిమాలుకోగా మళ్లీ ఆర్డరు వెయ్యడానికి ఒప్పుకున్నాడు. నెలాఖరులోపుగా అక్కడికి వేస్తారు.

ఇట్లు
వెంకట్రావు

ౠ

నరసాపురం
ది 15-7-47

ప్రియమైన వెంకట్రావుకి,

నీ ఉత్తరం అందింది. నాకోసం నువ్వు పడిన శ్రమకు నేను చాలా కృతజ్ఞుణ్ణి. కాని నా అదృష్టం యింకో విధంగా ఉంది. జనార్దనానికి రాజమండ్రీ కాలేజీలో సీటు దొరకలేదు. ఇంకా కొన్ని గొడవలవల్ల ఈ యేడాది యింకెక్కడా చదివించడానికి వీలులేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో నేను నరసాపురంలోనే ఉండిపోతే చాలా బాగుంటుంది. కాని నిన్ను మళ్లీ బదిలీ ఆర్డరు తీసివేయించమని శ్రమపెట్టడం భావ్యం కాదని ఆ సంగతి రాయదలచుకోలేదు.

ఇట్లు
భరద్వాజం

తా.క. నీవైతే ఏమన్నా చేయగలిగితే యావజ్జీవం కృతజ్ఞుడై ఉంటానన్న సంగతి వేరే చెప్పవలసిన అవసరం లేదు.

ఌ

గుంటూరు
ది 30-7-47

ప్రియమైన భరద్వాజానికి,

నీ ఉత్తరం అందినది. నాకు మద్రాసునుండి గుంటూరు బదిలీ అయింది. మొన్ననే యిక్కడ డ్యూటీలో చేరేను. గుంటూరు వచ్చేసినందువల్ల నీ విషయంలో ఏమీ చేయలేనందుకు క్షమించవలసింది. నీ యోగ, క్షేమాలు తరుచు రాస్తోండవలిసింది.

ఇట్లు
వెంకట్రావు